క్లుప్తంగా

వాణిజ్య పంటల సాగుతో అధిక లాభాలు


కుసుమ పంటను పరిశీలిస్తున్న ఏఓ గోపాల్

కొత్తూరు: సంప్రదాయ పంటల సాగును తగ్గించి వాణిజ్య పంటల సాగు చేస్తే ఆశించిన లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి గోపాల్ రైతులకు సూచించారు. మండలంలోని మల్లాపూర్ పంచాయతీ రెడ్డిపాలెం గ్రామంలో పలువురు రైతులు సాగు చేసిన కుసుమ పంటను ఆయన గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఏఓ మాట్లాడుతూ.. కుసుమ, వేరుశనగతో పాటు ప్రొద్దుతిరుగుడు పంటల సాగులో రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు. ముఖ్యంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు వచ్చే పంటలను సాగు చేసే విధానాన్ని అలవార్చుకోవాలని కోరారు. అప్పుడే వ్యవసాయం లాభసాటిగా ఉంటుందన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి ఘన నివాళి


రాంచందర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, నాయకులు

షాద్‌నగర్ రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాంచందర్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఆయన మృతికి వివిధ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని వివిధ పాఠశాలల్లో విధులు నిర్వహించిన రాంచందర్ ఉపాధ్యాయుడిగా అనేక సేవలను అందించారని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ కృష్ణ, నాయకులు రవీందర్, నర్సింలు, రామదాసు, శేఖర్, మహేందర్ యాదవ్, యాదగిరి, నరేష్, శంకర్, రాజు, శివకుమార్, నరేష్, కృష్ణారెడ్డి, తిరుపతి యాదవ్, వెంకటయ్య యాదవ్, రాజు, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిస్తే రోగాలు దూరం


విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

కొందుర్గు: వ్యక్తిగత పరిశుభ్రత తోపాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తే రోగాలు దరిచేరవని డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. రాష్ట్రీ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా గురువారం కొందుర్గు బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలో 110 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు.. విద్యార్థులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని, నిత్యం భోజనంలో ఆకుకూరలు, కూరగాయలు ఉండేలా చూసుకోవాలన్నారు. భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. చేతి వేలు గోర్లను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉషశ్రీ, శివలింగమ్మ, స్వాతి, వలంటీర్లు శివలీల, పావణి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ దంపతులకు సన్మానం



ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడ్ సర్పంచ్ సామల హంసమ్మ యాదిరెడ్డి ఆధ్వర్యంలో గత నెల 31నుంచి ఫిబ్రవరి 9వ తేది వరకు నిర్వహించిన కంటివెలుగు శిబిరం విజయవతంగా ముగిసింది. శిబిరంలో 1210 మందికి పూర్తిస్థాయిలో కంటి పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో కంటి వెలుగు విజయవంతం కోసం సొంత డబ్బు వెచ్చించి వైద్య బృందానికి చేదోడు వాదోడుగా నిలిచిన సర్పంచ్‌ను గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎల్మినేడు పీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ ఏ.నాగయ్య, కంటి వెలుగు అధికారి డాక్టర్ ఎస్.భాగ్యలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి వీహెచ్ టైటస్, సూపర్‌వైజర్ ఉమాదేవి, అజయ్‌కుమార్, సిబ్బంది ఫరీదాబేగం, అమృత, కొండల్‌రెడ్డి, మమత, రమేస్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ ఇల్లు ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనునాయక్

షాద్‌నగర్: అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించిన ధర్నాకు షాద్‌నగర్ నుంచి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు తరలివెళ్లారు. అంతకుముందు శ్రీనునాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలందరికీ డబుల్ ఇళ్లు ఇస్తామని 9 ఏళ్ల క్రితం సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ హామీ నేటికీ అమలు కావడం లేదని తెలిపారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం పేదలు నిరీక్షిస్తున్నారని పేర్కొన్నారు. హామీల అమల్లో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అదేవిధంగా ఇళ్ల స్థలాలు ఉన్న వారికి రూ. 3 లక్షలు ఇస్తామన్న హామీ అమలు కాలేదన్నారు. ఇప్పటికైనా సీఎం తన మాటను నిలుపుకోవాలని కోరారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ధర్నాకు వెళ్లిన వారిలో నాయకులు కృష్ణయ్య, రాములు, కుర్మయ్య, పాండు, వెంకటేష్, చెన్నయ్య, గోపాల్, హన్మంతు, యాదయ్య, కిషన్ తదితరులు ఉన్నారు.

చేవెళ్ల నుంచి..


చేవెళ్ల: నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

చేవెళ్ల: పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్‌లో జరిగే ధర్నా కార్యక్రమానికి చేవెళ్ల డివిజన్ నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంలో అధికారంలోకి వచ్చి ఎనిమిదేళ్లు అవుతున్నా ఎక్కడ కూడా ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కూడా ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ చేవెళ్ల డివిజన్ సభ్యులు ప్రభుదాస్, శ్రీనివాస్, బాలయ్య, పాండు, రమేశ్, యాదయ్య తదతరులు పాల్గొన్నారు.


హైదరాబాద్ ధర్నాకు వెళుతున్న నాయకులు

హామీల అమలులో బీఆర్ఎస్ విఫలం

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత శంకర్

కొత్తూరు: నీరు, నిధులు, నియామకాల పేరుతో ఉద్యమాలు సాగించి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రస్తుతం వాటి గురించి పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ పార్టీ షాద్‌నగర్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా గురువారం ఆయన పలువురు నాయకులతో కలిసి మండలంలోని మక్తగూడ, గూడూరు, మల్లాపూర్, స్టేషన్‌తిమ్మాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో పర్యటించారు. రైతులు, వృద్ధులు, స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలన కేవలం హామీలకు మాత్రమే పరిమితమైందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై పథకాల పేరుతో ప్రజల సొమ్మును దోచుకుంటున్నాయని ఆరోపించారు. తెలంగాణ సెంటిమెంట్‌తో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రస్తుతం జాతీయ రాజకీయాల్లో కూడా బీజేపీకి పరోక్షంగా సహకరించేందుకు జట్టు కట్టిందని ఆరోపించారు.


మల్లాపూర్ తండాలో పర్యటిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

తెలంగాణలో అభివృద్ధిపై ప్రశ్నించే ఇతర పార్టీల నాయకులను బీఆర్ఎస్ నేతలు అక్రమంగా పోలీసు కేసులు పెట్టి బెదిరిస్తున్నట్లు ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనపై ప్రజలు, ఉద్యోగులు, అన్ని వర్గాల వారు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే కాంగ్రెస్ పార్టీకి పట్టం కడతారని వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, నాయకులు వస్పుల మహేందర్, రఘు, సత్తయ్య, రాందాస్ నాయక్, దయానంద్ గుప్తా, కృష్ణ, కుమార్‌స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యే లక్ష్యం

చేవెళ్ల: ఇటీవల విడుదలైన ఐఐటీ, జేఈఈ ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనభరిచారని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ టేనావతి అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. ఐఐటీ, జేఈఈలో ఫలితాల్లో పాఠశాలకు చెందిన విద్యార్థి 73శాతం మార్కులు సాధించడం హర్షణీయమన్నారు. ఆదర్శ పాఠశాల నుంచి ఎన్‌ఎంఎంఎస్‌లో 26 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రంలోనే తమ పాఠశాల విద్యార్థులు ఎక్కువమంది ఎంపికై నట్లు చెప్పారు. అదేవిధంగా మలబార్ గోల్డ్ కంపెనీ వారు ఇచ్చే స్కాలర్‌షిప్‌లకు పాఠశాల నుంచి 150 మంది దరఖాస్తు చేసుకుంటే 120 మందికి అవకాశం వచ్చిందని చెప్పారు. ఆదర్శ పాఠశాలలో చేరేందుకు దరఖాస్తులకు ఈనెల 15వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 6 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్నాయని, సీట్ల భర్తీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. నాణ్యమైన విద్య అందించడమే ఆదర్శ పాఠశాల సిబ్బంది లక్ష్యమన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కేశంపేట: బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సబ్బండ వర్గాల అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో నిరుపేదల ఇళ్లల్లో పెళ్లికి ఆర్థిక సహాయం అందించడం జరుగుతోందన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న గోదా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. సర్పంచ్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ విశ్వనాథ, లక్ష్మీనారాయణగౌడ్, పర్వత్‌రెడ్డి, జమాల్ ఖాన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పల్లె నర్సింగ్‌రావు, ధన్‌రాజ్‌రెడ్డి, దశరథం తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను సక్సెస్ చేయాలి


చలో హైదరాబాద్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్మికులు

మొయినాబాద్ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 14న నగరంలోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించే బీఎంఎస్ మహాధర్నాను విజయవంతం చేయాలని రాణి ఇంజన్ వాల్స్ కార్మికుల ప్రధాన కార్యదర్శి తూర్పు రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి ముత్యాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని అజీజ్‌నగర్ వద్ద గల రాణి ఇంజన్ వాల్స్ కంపెనీ ఎదురుగా కార్మికులు, నాయకులు కలిసి బీఎంఎస్ మహాధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి టీ రామిరెడ్డి, ముత్యాల శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం రూ. 21 వేలు ఇవ్వాలన్నారు. ఈపీఎఫ్ 95 పెన్షన్ రూ. 2500లకు పెంచి కరువు బత్యం, మెడికల్ సౌకర్యం కల్పించాలన్నారు. వివిధ సంఘటిత రంగ కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులకు పర్మినెంట్ చేయాలని కోరారు. అంగన్‌వాడీ, ఆశా, జీడీఎస్ ఇతర స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. అధిక ధరలు తగ్గించి నిజాం షుగర్ కంపెనీతో పాటు మూతబడ్డ పరిశ్రమలను తెరిపించి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో రాణి ఇంజన్‌వాల్స్ కార్మికులు వెంకటేశ్వర్‌రావు, బాలరాజు, ఎన్ మల్లేష్, వీ పవన్‌కుమార్, సూర్యనాయుడు, శివరామరాజు, కే శ్రీనివాస్, గంగారాజు, వీ శ్రీనివాస్, సతీష్, ప్రతాప్, పరశురాం పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు విరాళం



షాద్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి స్థానిక వ్యాపారవేత్త పలబట్ల పాండురంగం గురువారం రూ. 25వేల విరాళాన్ని అందజేశారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల న్యాక్ గుర్తింపు కోసం వెలుతున్న సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ భానుప్రకాష్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవీందర్‌రెడ్డిలు కళాశాల అభివృద్ధి కోసం కృషి చేయాలని పలబట్ల పాండురంగంను కోరారు. స్పందించిన ఆయన విరాళం అందజేశారు. శివకుమార్, అధ్యాపకులు శ్రీలత, ఉత్తర ఫాల్గుణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ


స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

షాద్‌నగర్ రూరల్: పట్టణంలోని భాగ్యనగర్ కాలనీ కృష్ణవేణి పాఠశాలలో గురువారం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి వారికి బోధన చేశారు. చక్కటి ప్రతిభ కనబరిచి ఉపాధ్యాయుల అభినందనలు అందుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ రఫత్‌సుల్తానా ఆధ్వర్యంలో స్వయం పరిపాలనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యాశాఖ మంత్రిగా రుమానాబేగం, కలెక్టర్‌గా సుస్మిత అజీజ్ ఫాతిమా, డీఈఓగా సిద్రామహీన్, ఎంఈఓగా సమయా సమ్రీన్, ప్రిన్సిపాల్‌గా భవనకృతి, వైస్ ప్రిన్సిపాల్‌గా శ్రీనిఖిత, రాజకీయ నాయకులుగా మాజ్‌అహ్మద్, అబ్దుల్ రహ్మాన్ వ్యవహరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తాం

బీఆర్ఎస్ యువనేత ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

మంచాల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి బీఆర్ఎస్ పార్టీ పెద్దపీట వేస్తుందని ఆపార్టీ యువనేత ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మంచాల మండలంలోని తిప్పాయిగూడ, చిత్తాపూర్, తాళ్లపల్లిగూడ గ్రామాల్లో ప్రగతి నివేదన పాదయాత్ర కొనసాగింది. ఆయా గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే కిషన్ రెడ్డి పట్టుదలతో నేడు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. భవిష్యత్‌లో నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. యువకులకు క్రీడా వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి బహదూర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, ఎంపీపీ నర్మద, సర్పంచ్‌లు నాగరాజ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు సుకన్య, అనిత, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జానీపాష, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు రాజు, మండల అధ్యక్షుడు భద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.


మగ్గం నేస్తున్న ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

రాష్ట్రంలో నిరంకుశ పాలన

టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

షాద్‌నగర్: రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసాగుతోందని, ఈ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీపీసీసీ సభ్యుడు కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని 15, 16 వార్డుల్లో హాత్ సే హాత్ జోడో యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు రాహుల్ గాంధీ చేసిన పాదయాత్రతో దేశంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయన్నారు. అవినీతి, కుటుంబ పాలనతో విసిగిపోయిన తెలంగాణ ప్రజలు సోనియా గాంధీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న రాచరిక పాలనకు స్వస్తి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సీఎం కేసీఆర్ చేపట్టిన ప్రజా వ్యతిరేఖ విధానాలతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రజల ఆశయాలను కాంగ్రెస్ పార్టీ నెరవేరుస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ అవినీతి పాలన అంతమై సోనియమ్మ రాజ్యం స్థాపించేందుకు, అలాగే ప్రజల్లో భరోసా నింపేందుకు ఈ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్, సుధీర్, శ్రీకాంత్‌గౌడ్, పరశురాం, వంశీగౌడ్, ఉదయ్, కాట సుధీర్, మెరాజ్, మాదారం నర్సింహ, సోమ్లా నాయక్, జనార్దన్‌రెడ్డి, అశోక్, మహేష్, శివ, ఆవుల శ్రీకాంత్, సురేందర్, విష్ణు, వెంకటేష్, మహేందర్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.


ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సుదర్శన్

షాబాద్: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు పీఆర్టీయూ ఎంతో కృషి చేస్తోందని ఆ యూనియన్ మండల అధ్యక్షుడు సుదర్శన్ తెలిపారు. గురువారం షాబాద్‌లో పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు అన్ని రకాల సదుపాయల కల్పన కోసం పీఆర్‌టీయూ కృషి చేస్తోందన్నారు. టీచర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కరానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. 1971 నుంచి ఇప్పటి వరకు పీఆర్టీయూ అంచెలంచెలుగా ఎదుగుతూ వందల సంఖ్యలో ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించిందని తెలిపారు. కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షుడు యాదయ్య, మొయినాబాద్ మండల అధ్యక్షుడు బందయ్య, రాష్ట్ర బాధ్యులు ఎల్ నర్సింహులు, డేవిడ్‌రెడ్డి, లక్ష్మణ్, జిల్లా బాధ్యులు ప్రభాకర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, జయరాజ్, రవీందర్‌రెడ్డి, మండల బాధ్యులు హనుమంత్, ఖాజపాష, నర్సింహులు, ప్రశాంత్, కృష్ణయ్య, సంహాద్రి నాయుడు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.


సంఘం జెండాను ఎగురవేస్తున్న సుదర్శన్

మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా రాజు


రాజుకు నియామక పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి

నందిగామ: మండలంలోని మేకగూడ మత్స్య కార్మిక సహకార సంఘం అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన బండారి రాజు ముదిరాజ్‌ను గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం గ్రామంలో ఎన్నికల అధికారి అబ్దుల్ రఫీక్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సంఘంలోని 34 మంది సభ్యులు కలిసి అధ్యక్షుడితో పాటు తొమ్మిది మంది డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బండారి రాజు, డైరెక్టర్లుగా కృష్ణయ్య ముదిరాజ్, రాజు ముదిరాజ్, మల్లేష్, శ్రీకాంత్, సురేష్, శంకరయ్య, నర్సింహ, కృష్ణ, మేకం శ్రీనులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీకి ఎన్నికల అధికారి నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ మండల కన్వీనర్ మేకం రాజు ముదిరాజ్, నాయకులు హరిప్రసాద్, సత్యనారాయణ, హరిప్రసాద్, నర్సింహ, యాదయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఉపాధి పనులు

షాబాద్: గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు జోరుగా సాగుతున్నాయని బొబ్బిలిగామ గ్రామ సర్పంచ్ దండు అర్చన తెలిపారు. గురువారం ఆమె గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ పథకంలో ల్యాండ్ లెవలింగ్, ఫారం పండ్స్, మట్టి కట్టలు, చెరువుల్లో పూడికతీత, బంజరు భూముల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఉపాధి పనులను ఏపీఓ వీరాసింగ్ పరిశీలించారు. వడదెబ్బకు గురికాకుండా కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఫీల్డ్ పథకం అసిస్టెంట్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

జేబీఆర్ కళాశాలలో స్మారక దినోత్సవం



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ఆర్కిటెక్ట్ బాలకృష్ణ దోషి జ్ఞాపకార్థం నగరంలోని జేబీఆర్ ఆర్కిటెక్చర్ కళాశాలలో గురువారం స్మారక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్థ డైరెక్టర్ ఆర్ గాయత్రి జోగన్పల్లి, ఇంజనీర్ వేదకుమార్ మణికొండ అధ్యక్షత వహించారు. నగరంలోని ప్రముఖ ఆర్కిటెక్ట్స్, అర్బన్ ప్లానర్స్ ఆర్ సంజీవ్ జోషి, ఆర్‌జీ జయకృష్ణన్, జేబీఆర్ ఆర్కిటెక్చర్ కళాశాల అధ్యాపకులు, అన్ని సెమిస్టర్స్ విద్యార్థులు హాజరయ్యారు. నగరంలోని ఈసీఐఎల్ హౌసింగ్, టౌన్షిప్ ప్రాజెక్టు, సైబరాబాద్ ఆర్కిటెక్చర్ ప్రాజెక్టుల పనితీరుతోపాటు బీవీ దోషి డిజైన్ ఫిలాసఫీ నైపుణ్యంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ×లూసియానా×లో దోషిపై చిత్రీకరించిన 45 నిమిషాల నిడివి గల చిత్రం ద్వారా విద్యార్థులకు ఆర్కిటెక్చర్ నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. పూర్వ విద్యార్థులు దోషితో తమ అనుభవాలను గుర్తుచేసుకున్నారు.

వేడుకగా విగ్రహాల ప్రతిష్ఠాపన

కేశంపేట: మండలంలోని కాకునూర్‌లో మహా లింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం గణపతి, అమ్మవారి విగ్రహాలను ఘనంగా ప్రతిష్ఠించారు. ఆలయ కమిటీ చైర్మన్ గంగ్ర రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, టీడీపీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బక్కని నర్సింలు, స్త్రీశిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల, పీఏసీఎస్ చైర్మన్ గంగ్ర జగదీశ్వర్‌గౌడ్, సర్పంచ్ లక్ష్మమ్మ, బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింలు యాదవ్, షాద్‌నగర్ మున్సిపల్ కౌన్సిలర్ ఈశ్వర్ రాజు, వర్కాల లక్ష్మీనారాయణగౌడ్, పల్లె ఆనంద్‌కుమార్, తైదా పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

షాద్‌నగర్: సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని పట్టణంలోని గంజ్ ఆవరణలో గల గణపతి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ కే నరేందర్, కౌన్సిలర్ కే మహేశ్వరీ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఈశ్వర్ రాజు, నాయకులు వన్నాడ వెంకటేష్‌గౌడ్, మలగారి సత్యనారాయణ, శక్తి సాయిచరణ్, తాడిశెట్టి ప్రకాష్, గజవాడ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.


కేశంపేట: ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

మార్మోగిన శివనామస్మరణ

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం జాకారం సర్పంచ్ రాణి నివాసంలో గురువారం ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి శివ స్వాములు పెద్ద సంఖ్యలో పూజకు హాజరయ్యారు. దీంతో గ్రామం శివనామస్మరణతో మార్మోగింది. పూజ అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుస్వామి భూపాలచారి, శివ స్వాములు నర్సింలు, యాదయ్య, రామకృష్ణ, వెంకట్ రాంరెడ్డి, అంజి, మారుతి, బాలరాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

చేవెళ్ల: మండల కేంద్రంలోని కొనగట్టు భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయం వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు రెండవ రోజు వైభవంగా జరిగాయి. గురువారం గణపతి, సుబ్రహ్మణ్య స్వాములకు అభిషేకం, నాగదేవతలకు పూజలు, అమ్మవారికి మహా కుంభాభిషేకం, శివునికి మహా రుద్రాభిషేకం, గణపతి రుద్రహోమం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి శివలింగాన్ని, అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.


షాద్‌నగర్: పూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ నరేందర్ దంపతులు

రామన్నగూడలో..

చేవెళ్ల: మండలంలోని రామన్నగూడలో గురువారం శివమాలధారులు మహా పడిపూజ నిర్వహించారు. భక్తి గీతాలు ఆలపించారు. అనంతరం భక్తులకు, అన్నదానం చేశారు. పూజల్లో పలు పార్టీల నాయకులు, గ్రామ సర్పంచ్ లావణ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.